

# బంద్

ఆనంద్

షాపులు తెరవలేదు. బస్సులు నడవటంలేదు. స్కూళ్ళు లేవు. కాలేజీల్లేవు. ఆఫీసులు చాలా మందకొడిగా పనిచేస్తున్నాయి.

బంద్.

పోలీసులు తిరుగుతున్నారు. మచ్చుకొక్క సిటీబస్సుకూడా కన్పించటంలేదు. ఆటోలూ లేవు. తప్పనిసరై జనం నడిచే వెళ్తున్నారు. సిగిరెట్లుకూడా దొరకటంలేదు.

నగరమంతా బంద్.

ఉద్యమ కార్యకర్తలు మహోత్సాహంతో తిరుగుతున్నారు. ఆవేశంతో ఊగుతున్నారు. షాపు తెరిచినట్టు కనబడితే చాలు — రాళ్ళు విసురుతున్నారు. ఆటో కన్పిస్తే చాలు — ఆటకాయించి తంతున్నారు. పోలీసులు అంతా హుషారుగానే కనిపెడుతున్నారు.

నగరం పూర్తిగా బంద్.

బంద్ ప్రశాంతంగా జరిగిందని ఆకాశవాణి మధ్యాహ్నం వార్తల్లో ప్రకటించింది. ఇక ఫరవా లేదని జనం ఊపిరి పీల్చుకున్నారు.

ఇంతకీ— ఎందుకీ బంద్ ?

భాష. భాష. భాష.

అంతా భాష ఘోషే.

రాష్ట్ర భాషకే పట్టం కట్టాలి. ఇంగ్లీషొద్దు. హిందీ అసలే వద్దు. ఇతర భాషలు కూడా వద్దు.

స్కూళ్లో రాష్ట్ర భాష పాసైనవాళ్ళకే ఉద్యోగాలివ్వండి. ఇంతవరకూ ఇక్కడ ఉద్యోగాల్లో ఉన్నవాళ్ళు— ఇంకైనా రాష్ట్ర భాష నేర్చుకొని పరీక్ష పాసు కాకుంటే—

పంపెయ్యండి, ఉద్యోగాలూడబీకండి.

మన భాషే జిందాబాద్. మిగతావన్నీ ముర్దాబాద్.

ఇక ఫర్వాలేదని జనం ఊపిరి పీల్చుకొనే లోపలే— మెరుపులా నగరమంతటా తెలిసిపోయింది తాజావార్త.

పాత మిల్లుల ప్రాంతంలో కత్తిపోట్లు, రాష్ట్రేతర ముఠాలు రెండూ ఘర్షణ పడ్డాయి.

దొమ్మీ, దౌర్జన్యం.

ఇండ్లలోకి దూరి పొడిచారట.

పదేండ్ల పిల్లాడు అక్కడికక్కడే చచ్చిపోయాడు. మరో యువకుడు నట్టనడిబజార్లో నెత్తుటి మడుగులో నేలకొరిగాడు.

పోలీసులేమయ్యారు ?

పాత మిల్లుల ప్రాంత మంతా ఉద్రిక్తత, భయభ్రాంతి. అరవై మందిని ఆసుపత్రిలో చేర్చారు. ఐదారు మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.

పోలీసులేం చేస్తున్నారు ?

ముఖ్యమంత్రి ఏమంటున్నారు ?

జనతా బజారు దగ్గర ఆటో వాణ్ణి చితకదన్నారు. టూరిస్టు బస్సున్నూ ఆటకాయించారు. రాష్ట్రేతర పాసెంజర్లను దిగి నడవమన్నారు. బస్సును తగలబెట్టబోగా పోలీసులొచ్చారు. దొమ్మీ, లాఠీఛార్జీ. ఇరవైమంది పోలీసులకు గాయాలు.

సాయంత్రమౌతున్నా— బయలుదేరబోతున్న ఆటోలు వెనక్కితగ్గి ఆగిపోయాయి

ఉద్యమకారులు మహోద్ధృతంగా తిరుగుతున్నారు. లాంఛనప్రాయమైన బంద్ కాదు రేప్పొద్దునదాకా షాపులు తెరవటానికే వీల్లేదు.

కార్లమీద, స్కూటర్లమీద తిరుగుతున్నారు కార్యకర్తలు.

పాత మిల్లుల ప్రక్కనే మెయిన్‌బజారులో అల్లరయింది సైన్‌బోర్డు గురించి రగడ మొదలైంది. ఇంగ్లీషులో రాశావు. 'మీ' భాషలో రాసుకున్నావు, మరి, రాష్ట్ర భాషలో ఎందుకు రాయలేదు? షాపు యజమాని రాష్ట్రేతరుడు— మంచి బలం ఉన్నవాడు కూడా. రగడపెరిగింది షాపు ధ్వంసమైంది. సైన్‌బోర్డు నేలబడింది సోడాబుడ్లు లేచాయి. పోలీసులొచ్చేసరికి అక్కడ ఇద్దరు — కత్తులు దిగబడిన గుండెల్తో — చచ్చిపడిపోయారు.

నగరంలో కర్ఫ్యూ విధించారు

* * *

అర్ధరాత్రి దాటిన తర్వాత తూలుతూ ఇంటి కొచ్చాడు ఉద్యమ కార్యకర్త. బంద్ నిర్వహణలో కనబరచిన వీరత్వం ఇప్పటికి కాస్త సంతృప్తి పడింది.

పడుకుని ఉందతని భార్య. అతను క్షేమంగా తిరిగొచ్చినందుకు మగత నిద్రలోనే నిట్టూర్చింది. మౌనంగా వచ్చి పడుకున్నాడతను. దగ్గరకు తీసుకున్నాడు.

"ఊఁ — " అందామె, నిద్ర చెదిరినట్టు.

"ఊఁ ? — " అంటు కౌగిలించుకున్నాడు. దర్పంతో అతను, ఆర్తితో ఆమె ...

చిత్రం, ఏ భాషో అతను ఆలోచించనే లేదు.

* * *

రాష్ట్రేతర వర్గాల నాయకునికి నిద్ర పట్టలేదు. పళ్ళు నూరుతూ రేపటి పథకం గురించి ఆలోచిస్తున్నాడు. ప్రక్కనే భార్య గాఢనిద్రలో ఉంది. కొంతసేపటికి ఉయ్యాల్లో బిడ్డ కేరుకేరుమని ఏడుపు మొదలెట్టాడు

అందర్నీ పాడిపించేస్తాను — అనుకున్నాడు నాయకుడు ఆవేశంగా.

భార్య ఉయ్యాల దగ్గరికి వెళ్తున్నా, బిడ్డ ఏ భాషలో ఆమెను పిలిచాడో నాయకుడు ఆలోచించడు.

* * *

వీధరుగు మీద నడివయసు వ్యక్తి పొట్టలో మోకాళ్ళు కుక్కుకుని చలికి వణుకుతూ పడుకున్నాడు వాడు బికారి, పుట్టు చెవుడు, పుట్టు మూగ.

పేటంతటికీ వాణ్ణి తెలుసు. కాళ్ళు వాచేలా తిరిగినా ఇవాళ ఎవరూ వాడికి పట్టెడన్నం పెట్టలేదు. దీనికేం దిగుల్లేదు వాడికి. తనకు శబ్దాలే వినిపించవు అందరూ మామూలుగానే నోళ్ళు కదిలిస్తున్నారు కాని ఎందుకింత కలవర పడుతున్నారో, భయపడుతున్నారో అర్థం కావటం లేదతనికి. ★